

సాంకేతిక విద్య.. అందుకుంటే భవిత

పదో తరగతి ఉత్తీర్ణతతో సాంకేతిక విద్యకు పునాది వేసే 'పాలిసెట్'కు సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది.


8లో



ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న ఆటో

గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఆరుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

డెల్టాలకు 8,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.15 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి జిల్లా విజ్ఞాన శాస్త్ర సంబరాలు

అమలాపురం టౌన్: జిల్లా విజ్ఞాన శాస్త్ర సంబరాలు–2025 ఈ నెల 28, మార్చి 1, 3 తేదీల్లో జరగనున్నాయి. వీటిని జిల్లా విద్యా శాఖ సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో డీఈఓ డాక్టర్ ఎస్కే సలీమ్ బాషా పర్యవేక్షణలో నిర్వహిస్తారు. విజ్ఞాన శాస్త్ర సంబరాల కార్యక్రమాల రోజు వారీ వివరాలను జిల్లా సైన్స్ అధికారి గిరజాల వీఎస్ సుబ్రహ్మణ్యం వివరించారు. 28న ప్రతి పాఠశాలలో జిల్లా విజ్ఞాన శాస్త్ర దినోత్సవ కార్యక్రమాల నిర్వహణ, జిల్లా సైన్స్ విభాగం రూపొందించిన 'ఆన్‌లైన్ క్విజ్'ను 8, 9 తరగతి విద్యార్థులకు నిర్వహిస్తారు. క్విజ్ సిలబస్ పరంగా భౌతిక, రసాయన, జీవశాస్త్రం, గణిత శాస్త్రంపై ఉంటాయి. జిల్లా స్థాయి ముఖ్య కార్యక్రమంగా కపిలేశ్వరపురం మండలం మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శాస్త్రవేత్త గొడవర్తి భావన్నారాయణతో సెమినార్ జరుగుతుంది. 'ఎంపవర్‌మెంట్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్' అనే అంశంపై ఈ సెమినార్ ఉంటుంది. మార్చి 1న మండల స్థాయి క్విజ్ పోటీ (మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు) జరుగుతుంది. మార్చి 3న జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీ (మండల స్థాయిలో ఎంపికైన మొదటి 70 మంది విద్యార్థులకు) నిర్వహిస్తారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేత, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థుల ప్రదర్శన ఉంటుంది.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న ఇండియన్ బ్యాంక్ చెన్నై, బెంగళూరు స్పైకర్స్ టీమ్‌లు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని ఏఎస్ఆర్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్రీడలను, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోర్టును ప్రారంభించగా, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం క్రీడా జ్యోతిని వెలిగించారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో జీఎస్టీ ముంబయి, బెంగళూరు స్పైకర్స్, ఇండియన్ బ్యాంక్ చెన్నై, ఇన్‌కమ్ ట్యాక్స్ చెన్నై, హైపర్స్ స్పోర్ట్స్ క్లబ్ ముంబయి, కేరళ స్పైకర్స్ కేరళ టీమ్‌లు తలపడనున్నాయి. తొలిరోజు మొదటి మ్యాచ్‌గా ఇండియన్ బ్యాంక్ చెన్నై, బెంగళూరు స్పైకర్స్ పోటీ జరగ్గా బెంగళూరు స్పైకర్స్ విజేతగా నిలిచింది. రెండో మ్యాచ్‌గా జీఎస్టీ ముంబయి, కేరళ స్పైకర్స్, మూడో మ్యాచ్‌గా ఇన్‌కమ్ ట్యాక్స్ చెన్నై, హ్యాపర్స్ స్పోర్ట్స్ క్లబ్ ముంబయి టీమ్‌లకు పోటీ కొనసాగుతోంది.

కిక్కిరిసిన అయినవిల్లి క్షేత్రం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయం బుధవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. ఈ ఒక్కరోజే వివిధ పూజా టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలుగా ఆలయానికి రూ.2,83,737 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 72 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 16 జంటలు, స్వామి గరిక పూజల్లో ఒక జంట పాల్గొన్నారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని 1,720 మంది స్వీకరించారు. ఆలయంలో కొలువైన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారికి విశేష పూజలు చేశారు.



ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



కోటిపల్లి రేవులో పుష్కరఘాట్ వద్ద పుణ్యస్నానాలకు తరలివచ్చిన భక్తులు

ముక్కంటి... ప్రణమిల్లె జగతి



కోటిపల్లిలో సోమేశ్వర స్వామివారికి అభిషేకం చేస్తున్న పండితుడు

- భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కంటిచూపుతో భువనాన్ని నడిపే శంకరుడా.. నాగాభరణుడా.. నంది వాహనుడా.. భీమశంకరుడా.... గౌరీశ్వరుడా.. మంజునాథుడా.. నమోనమః అంటూ భక్తజనం ఆ ముక్కంటికి ప్రణమిల్లింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాల్లో ఓం నమః శివాయ మంత్రం మార్మోగింది. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో రోజంతా ఆధ్యాత్మిక సందడి కనిపించింది. ఉదయం నుంచి క్యూ లైన్లలో బారులు తీరిన భక్తులు స్వామిని దర్శించుకుని.. ఉపవాస దీక్షలు విరమించారు.

రామచంద్రపురం రూరల్/ ఐ.పోలవరం/ కె.గంగవరం: హరహర మహాదేవ శంభోశంకర నామస్మరణతో ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయం మార్మోగింది. పంచారామాలలో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ పీఠంగా విరాజిల్లుతున్న శైవక్షేత్రం కావడంతో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తజన సంద్రమైంది. ఆలయ ప్రాంగణం అంతా పంచాక్షరీ నామంతో ప్రతిధ్వనించింది. పంచారామం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి రావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. తెల్లవారు జాము నుంచి సప్త గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. 33 మట్టి కుండలతో అభిషేక ద్రవ్యాలు, సప్తనదీ జలాలు, 12 గుండాల నుంచి సేకరించిన జలాలతో స్వామికి తొలి అభిషేకం చేశారు. వేద పండితులు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెంట్లలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పొద్దుపోయే వరకూ స్వామివారి దర్శనానికి భక్తులు వస్తూనే ఉన్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

శుభంకరా.. వీరేశ్వరా..

నిత్య కల్యాణం.. పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఐదు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సుమారు 30 వేల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేశంలో ప్రతి సంవత్సరం ఒకచోట జరిగే పుష్కర నదుల నుంచి తీసుకువచ్చిన జలాలతో ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. గంగ, యమున, సరస్వతి, నర్మద, గోదావరి, కృష్ణా, కావేరి, భీమరథి, పుష్కరిణి, తుంగభద్ర, సింధు, ప్రణీత నదుల నుంచి తీసుకొచ్చిన జలాలతో ఆలయ పండితులు నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు యనమంద్ర సత్యసీతారామశర్మ, యనమంద్ర సుబ్బారావు, పేటేటి శ్యామల కుమార్ పర్యవేక్షణలో పుష్కర నదీ జలాభిషేకం చేశారు. ద్వాదశ పుష్కర నదీ జలాలకు తొలుత గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ, లక్షపత్రి పూజ చేశారు. ద్వాదశ పుష్కరనదీ జలాల అభిషేకాన్ని చూసేందుకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లా వాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం మేళతాళాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో నందాదీపం మహోత్సవం జరిగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, దేవదాయ శాఖ తనిఖీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కోటిపల్లి.. భక్తులతో శోభిల్లి

మహా శివరాత్రి సందర్భంగా కోటిపల్లిలోని ఛాయా సోమేశ్వర స్వామివారి ఆలయం ఆధ్యాత్మికతతో శోభిల్లింది. తెల్లవారు జాము నుంచి గౌతమి గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. గంట గంటకూ ఈ రద్దీ పెరుగుతూనే ఉంది. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకూ సుమారు లక్ష మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల కోసం క్యూలైన్లో టెంట్లు ఏర్పాటు చేసి తాగునీరు పంపిణీ చేశారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకటరమణ, ఎస్సై జానీ బాషా ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రేవు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పడవలు, గత ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన కోటి దీపారాధనలో రామచంద్రపురం ఆర్డీఓ అఖిల తదితరులు పాల్గొన్నారు. సీఎఫ్ఓ నల్లం చక్రధరరావు, ఆలయ ఈఓ భీమశంకరం దేవదాయ, ధర్మదాయ శాఖ తనిఖీదారు ఆర్.బాలాజీ రామ్‌ప్రసాద్, ఇతర దేవస్థాన సిబ్బంది భక్తులకు సహాయ సహకారాలు అందించారు.



ద్రాక్షారామలో భీమేశ్వర స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం చేస్తున్న పండితులు



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో క్యూ లైన్లలో భక్తులు

ఆట కదరా శివా..!

- గోదావరి స్నానానికి దిగి ఐదుగురు యువకుల మృతి
- మరో ఏడుగురు సురక్షితం
- మృతులంతా తాడిపూడి వాసులే
- తాడిపూడిలో మిన్నంటిన రోదనలు

కొవ్వూరు/తాళ్లపూడి: మహా శివరాత్రి రోజు తాడిపూడిలో తీరని విషాదం చోటు చేసుకుంది. పరమేశ్వరుని దర్శనానికి గోదావరి నదిలో స్నానాలు ఆచరించి వెళ్దామనుకున్న 12 మంది యువకులలో ఐదుగురు నీట మునిగి మృతి చెందగా మరో ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. బుధవారం ఉదయం తాడిపూడి గ్రామ శివారున ఇసుక ర్యాంపు వద్ద ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆ యువకులు నదిలో శివరాత్రి పుణ్య స్నానాలు ఆచరించేందుకు గ్రామ శివారున చింతలపూడి ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వెనుక భాగంలోని ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. నదిలో స్నానాలు ఆచరించి ప్రక్కిలంక శివాలయానికి వెళ్దామనుకున్నారు. స్నానాల కోసం నదిలో దిగారు. ఆ ప్రాంతంలో ఇసుక మేటలు వేయడంతో నదిలోతు తక్కువగా ఉంది. రెండు మూడు అడుగుల మేర మాత్రమే నీరు ఉండడంతో వారంతా ఉత్సాహంగా జలకాలాడుతూ కొంత ముందుకు వెళ్లారు. అక్కడ నది లోతుగా ఉండడంతో వారిలో పడాల దుర్గాప్రసాద్ (19), పడాల దేవదత్త సాయి (18), అనిశెట్టి పవన్ గణేష్(18), గర్రే ఆకాష్ (19), తిరుమలశెట్టి పవన్ కుమార్ (19) అదుపుతప్పి ఒకరి తర్వాత మరొకరు నీట మునిగి మృత్యువాత పడ్డారు. వీరితో పాటు వెంట వెళ్లిన పడాల మల్లికార్జున్, ఆకుల రాజేష్, గంటా రాజా నరేంద్ర, గర్రే హర్షవర్ధన్, దుర్గాప్రసాద్, కరిబండి వినయ్‌తేజ, టేకు అంజనికుమార్ సురక్షితంగా బయటపడ్డారు. మునిగిపోతున్న వాళ్లను రక్షించేందుకు వారు యత్నించినప్పటికీ, ఈత రాకపోవడంతో వారి కళ్లెదుటే నదిలో మునిగిపోయారు. విషయం తెలుసుకుని స్థానిక గ్రామస్తులు భారీ సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్‌తో ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. స్థానిక జాలర్లు, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలతో నదిలో పడవల సాయంతో గాలించి మృతదేహాలను వెలికితీశారు. రిస్క్యూ టీం నాలుగు గంటల పాటు శ్రమించి, వెలికితీసిన మృతదేహాలను కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఘటనా ప్రదేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయబాబు, డీఎఫ్‌వో మార్టిన్ లూథర్, తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ పర్యవేక్షించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ తలారి వెంకట్రావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మంత్రి కందుల దుర్గేష్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతదేహాలను పరిశీలించి, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని ప్రకటించారు.



సంఘనా ప్రదేశంలో రోధిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



అనిశెట్టి పవన్ గణేష్ మృతదేహం తీసుకు వస్తున్న దృశ్యం

వారందరిదీ ఒకే గ్రామం

గోదావరిలో మునిగి మృత్యువాత పడిన ఐదుగురు యువకులు తాడిపూడి వాసులే. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు నిరుపేదలు. వీరి మృతితో ఆ సామాజిక వర్గంలో విషాదం అలుముకుంది. మృతుల్లో ముగ్గురు వారి కుటుంబాల్లో ఏకైక కుమారులు కావడం, 20 ఏళ్ల లోపువారే కావడంతో వారి బాధ వర్ణనాతీతం.

నాలుగేళ్ల క్రితం ముగ్గురు దుర్మరణం

కొవ్వూరు పట్టణంలో సీతారామ స్నాన ఘట్టం సమీపంలో గోదావరి నదీ పాయల్లో స్నానాలకు వెళ్లి చాగల్లుకి చెందిన ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. 2021 ఏప్రిల్ 11న గోదావరి నదీ పాయల్లో నీరు తక్కువగా ఉందని వెళ్లి చాగల్లుకి చెందిన ఆరుగురు యువకులు ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందారు. అదే ఏడాది కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ముగ్గురు మత్యువాత పడ్డారు. గోదావరి నదిలో వేసవి కాలంలో నీరు తగ్గిపోవడంతో ఇసుక మేటలు బయటపడుతున్నాయి. ఆ సమయంలో లోతు తక్కువగా కనిపిస్తుందని భావించి స్నానాలకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మండలి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు
- జిల్లాలో 64,417 మంది ఓటర్లు
- 95 పోలింగ్ కేంద్రాలు
- 550 మంది పోలింగ్ సిబ్బంది

సాక్షి, అమలాపురం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కీలక ఘట్టానికి తెరలేచింది. మండలి ఎన్నికలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు ఉండగా, కోనసీమ జిల్లాలో 64,327 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 37,114 కాగా, మహిళలు 27,355, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోనున్నారు.

జిల్లాలో మూడు డివిజన్ల పరిధిలో మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ, 22 మండలాల పరిధిలో జరిగే ఎన్నికలకు సంబంధించి 95 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అమలాపురం డివిజన్‌లో 45, రామచంద్రపురంలో 23, కొత్తపేటలో 27 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అత్యధికంగా అమలాపురం మున్సిపాలిటీ, మండలంలో 10, మండపేట మున్సిపాలిటీ, మండలంలో 8, రామచంద్రపురం మున్సిపాలిటీ, మండలంలో ఏడు చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు 550 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఇందులో ప్రిసైడింగ్ ఆఫీసర్లు 114, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 114, ఇతర పోలింగ్ సిబ్బంది 220 మంది, మైక్రో అబ్జర్వర్లు 114 మంది ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు అమలు చేసేందుకు జిల్లాలో 22 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్‌లను నియమించారు. అలాగే మరో 22 ఫ్లైయింగ్ స్క్వాడ్లు, 10 స్టాటస్టిక్ సర్వేలెన్స్, 22 స్పెషల్ వీడియో టీమ్‌లను ఏర్పాటు చేశారు.



అమలాపురం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం

ఎన్నికల ఏర్పాట్లు ఇలా..

పురుష ఓటర్లు	:	37,114
మహిళా ఓటర్లు	:	27,355
ట్రాన్స్‌జెండర్ ఓటర్లు	:	2
పోలింగ్ కేంద్రాలు	:	95
పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలు (అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం)	:	3
ప్రిసైడింగ్ అధికారులు	:	114
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు	:	114
ఇతర పోలింగ్ అధికారులు	:	114

పోలింగ్ సామగ్రి పంపిణీ

శాసనమండలి పోలింగ్ కేంద్రానికి సంబంధించి జిల్లాలో మూడు కేంద్రాల ద్వారా బుధవారం పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. అమలాపురం వెత్సావారి అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద, రామచంద్రపురంలో వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కొత్తపేటలో ప్రభుత్వ హైస్కూల్ వద్ద ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. పంపిణీ కార్యక్రమాలను ఆయా డివిజన్ ఆర్డీఓలు బి.మాధవీలత, డి.అఖిల, పి.శ్రీకర్ పర్యవేక్షించారు.

పోలింగ్‌కు సహకరించండి

పట్టభద్రుల శాసన మండలి పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకు ఓటర్లు సహకరించాలని అమలాపురం ఆర్డీఓ కె.మాధవీలత కోరారు. పోలింగ్ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అమలాపురం వెత్సావారి అగ్రహారంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాలెట్ బాక్స్‌లు, ఓటరు జాబితా కాపీలు, వరుస క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్ల వివరాల చార్టులు, బ్యాలెట్ పత్రాలు తదితర సామగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ సిబ్బందికి అందించామన్నారు.

హోరాహోరీగా పోరు

ఈ ఎన్నికల బరిలో మొత్తం 35 మంది ఉన్నారు. ప్రధాన పోటీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థి గిడ్ల వీర రాఘవులు మధ్య నెలకొంది. అంగ బలం, ఆర్థిక బలంతో తొలుత కూటమి అభ్యర్థి సునాయాసంగా గెలుస్తారని అభిప్రాయం నెలకొన్నప్పటికీ ప్రచారం మొదలైన తర్వాత పరిస్థితి మొత్తం తారుమారైంది. పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు గట్టి పోటీ ఇస్తున్నారు. పోరు నువ్వా నేనా అన్నట్టుగా మారడంతో అధికార పార్టీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు ముచ్చెమటలు పడుతున్నాయి. మరి కొంతమంది అభ్యర్థులు రంగంలో ఉండగా, ఒకరిద్దరి వల్ల కూటమి అనుకూల ఓటింగ్‌లో చీలిక వస్తుందనే ప్రచారం జరుగుతుంది.



అమలాపురంలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవీలత

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 - 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

హోరాహోరీగా హాకీ పోటీలు



ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. ఢిల్లీ సెక్టార్, కాన్పూర్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ సెక్టార్, అలాగే హర్యానా, మహారాష్ట్ర మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా విజయం సాధించాయి. హైదరాబాద్ ఆర్ఎస్‌బీ, ముంబయి ఆర్ఎస్‌బీ మధ్య జరిగిన మ్యాచ్‌లో అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో ఇరు జట్లు గొడవ పడడంతో మ్యాచ్‌ను నిర్వాహకులు మధ్యలో ఆపేశారు.

కోనసీమ మోనాలిసా అంటూ పోస్టింగ్‌పై కేసు

ముమ్మిడివరం: ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ బాలికపై పోస్టింగ్ పెట్టి ఆమెను మనస్తాపానికి గురి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు. సీహెచ్ గున్నేపల్లిలో ఆదివారం జరిగిన సత్తెమ్మ తీర్థంలో అమలాపురానికి చెందిన ఓ బాలిక పూసలు అమ్ముకుంటుండగా, అమలాపురం శివారు చింతాడ గరువుకు చెందిన సత్తి దేవీశ్రీప్రసాద్ ఆమె వీడియోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో కోనసీమ మోనాలీసా అంటూ పోస్టింగ్ పెట్టాడు. ఆ పోస్టింగ్‌కు వేలల్లో లైకింగ్‌లు రావడంతో ఆ బాలికను తోటి విద్యార్థినులు ఎగతాళి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో ఆ బాలిక పినతల్లి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాంకేతిక విద్య.. అందుకుంటే భవిత

- పాలిసెట్‌కు నోటిఫికేషన్
- 'పది' విద్యార్థులకు చక్కని అవకాశం
- ఏప్రిల్ 30న ప్రవేశ పరీక్ష



పదో తరగతి విద్యార్థులు

రాయవరం: పదో తరగతి ఉత్తీర్ణతతో సాంకేతిక విద్యకు పునాది వేసే 'పాలిసెట్'కు సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు పొందవచ్చు. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందుగానే సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు పాలిసెట్-2025 నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. దీనికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలు, ఆ కళాశాలల్లో ఉన్న సీట్ల వివరాలు, పరీక్ష తేదీ తదితర వివరాలు 'సాక్షి' పాఠకుల కోసం..

భావిజీవితానికి బాటలు

పాలిటెక్నిక్‌లో ప్రవేశం ద్వారా తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి ఉన్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. అటువంటి వారికి పాలిటెక్నిక్ కోర్సులు చక్కని వేదికలని పలువురు సాంకేతిక విషయ నిపుణులు పేర్కొంటున్నారు. పాలిసెట్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి విలువైన సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందే వీలుంటుంది. పాలిసెట్-2025 కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దరఖాస్తుల తుది గడువు ప్రకటించలేదు.

లభించే కోర్సులు

పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. పలు చోట్ల ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచ్‌కు 60 నుంచి 120 వరకూ సీట్లు అందుబాటులో ఉంటాయి. కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉండగా, జిల్లా వ్యాప్తంగా మరో ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. రామచంద్రపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ 30, మెకానికల్ 30 సీట్లు ఉన్నాయి. ఐదు ప్రైవేట్ కళాశాలల్లో సుమారు 1,500 వరకు సీట్లు ఉన్నాయి. అలాగే కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలోని కళాశాలల్లో ఆయా కోర్సుల్లో సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. ఇందులో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు. పాలిసెట్ ఎంట్రన్స్‌లో క్వాలిఫై మార్కులు 35గా నిర్ణయించారు.

పాలిసెట్ ఎంట్రన్స్ ఇలా..

పాలిసెట్ ఎంట్రన్స్‌ను 120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు పరీక్ష ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఎంట్రన్స్ పరీక్ష జరుగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారు. ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400గా నిర్ణయించారు.

విద్యార్థులకు ప్రయోజనాలెన్నో..

పాలిటెక్నిక్‌లో ఏ కోర్సును పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతుంది. ఈ కళాశాలల్లో ఇటీవల తరచూ ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి మూడేళ్లకు కేవలం రూ.13 వేలు అవుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ సెకండియర్‌లో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చదువుకునేందుకు ఉపకరించే పాలిసెట్-2025కు దరఖాస్తు చేసుకోవాలి. పాలిటెక్నిక్ చదివితే చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధికి అవకాశముంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు, సంబంధిత మెటీరియల్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నాం.

– డాక్టర్ సముద్రాల రామారావు, జిల్లా కన్వీనర్, పాలిసెట్-2025, కోనసీమ

టెన్నిస్ విజేతగా పద్మరాఘవరావు



టెన్నిస్‌లో విన్నర్స్ పద్మరాఘవరావు, తులసీరామ్‌లకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 22 నుంచి 25 వరకూ నిర్వహించిన టోర్నమెంట్‌లో స్థానిక పారిశ్రామిక వేత్త పసల పద్మరాఘవరావు విజేతగా నిలిచారు. 70 ప్లస్ ఏజ్ గ్రూప్‌లో పద్మరాఘవరావు మైసూరుకు చెందిన తులసీరామ్‌తో కలిసి డబుల్స్‌లో విన్నర్స్‌గా, 65 ప్లస్ ఏజ్ గ్రూప్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎం.సురేష్‌తో డబుల్స్‌లో రన్నర్స్‌గా విజయం సాధించారు. ఈ మేరకు టోర్నమెంట్ విశేషాలను బుధవారం ఆయన స్థానిక విలేకర్లకు వివరించారు. టోర్నమెంట్ డైరెక్టర్‌గా ఏఆర్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డాక్టర్ ఎస్.ప్రవీణ్, టోర్నమెంట్ స్పాన్సర్‌గా టీకే చౌదరి వ్యవహరించారని చెప్పారు. పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ప్రభుత్వ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి కొప్పిరెడ్డి సత్యనారాయణమూర్తి తదితరులు పద్మరాఘవరావును అభినందించారు.

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న ఆటో

- ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు



బి.ప్రత్తిపాడులో ఘటనా ప్రాంతంలో ఆటో

పిఠాపురం: గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఆరుగురికి గాయాలైనట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. పిఠాపురం పాదగయ క్షేత్రానికి పుణ్యస్నానాలు చేయడానికి తొండంగి మండలం గోపాలపట్నంకు చెందిన బెక్కం నాగేశ్వరరావు, ఆయన తల్లి మంగాయమ్మ, అన్నవరానికి చెందిన ఎర్రమిల్లి అఖిలేష్, ఎర్రమిల్లి రాజు, ఎర్రమిల్లి భాగ్యలక్ష్మి, శంఖవరం మండలం శృంగవృక్షంకు చెందిన ఎ.చంద్రరావు, బొండు సత్యవతిలు ఆటోలో బయలుదేరారు. ఆటో గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్దకు వచ్చేసరికి అక్కడ ఆగి ఉన్న వ్యాన్‌ను బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో బెక్కం నాగేశ్వరరావును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని తల్లి మంగాయమ్మ అక్కడే చికిత్స పొందుతోంది. మిగిలిన వారిని వైజాగ్, కాకినాడలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పించారు. గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా



చిడిపి సమీపంలో బోల్తా పడిన ఆటో

కొవ్వూరు: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టిసీమలో వీరభద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. కొవ్వూరు మండలం చిడిపి సమీపంలోని ప్రమాదకర మలుపులో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఆటోలోని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన తూము రమణ (51) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే అదే గ్రామానికి చెందిన వనము వీరబాబు, వనము దుర్గాభవానీ, వనము సత్యవతి, వనము గణపతి, రాయుడు మణికంఠ తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ పరామర్శించారు. మృతుడి కుమారుడు తూము గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆర్.భగవాన్ దాస్ తెలిపారు. రాచపల్లి గ్రామంలో ఒకే వీధికి చెందిన వారంతా ఆటోలో పట్టిసీమకు వెళ్తుండగా ఈ ప్రమాదం బారిన పడ్డారు.



తూము రమణ (ఫైల్)

పశువుల అక్రమ రవాణా

కిర్లంపూడి: పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రత్తిపాడు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కంటైనర్ లారీని తనిఖీ చేయగా, దానిలో 48 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. అనకాపల్లి నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఎద్దులను తరలిస్తున్నట్టు తేలింది. దీంతో లారీని సీజ్ చేసి నక్కపల్లి మండలం, దేవవరం గ్రామానికి చెందిన డ్రైవర్ మాంతి వెంకటత్రినాథ్, సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఎద్దులను కృష్ణునిపాలెంలోని గోశాలకు అప్పగించామన్నారు.

రెడ్‌క్రాస్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రామారావు



కాకినాడ సిటీ: రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ చైర్మన్ వైడీ రామారావును ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసిందని సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఈవో ఏకే ఫరిదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి 12 మందితో ఏర్పడే జాతీయ కార్యవర్గానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా చైర్మన్‌గా ఉన్నారన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జాతీయ అధ్యక్షులుగా రాష్ట్రపతి వ్యవహరిస్తున్నారన్నారు. వైడీ రామారావుకు జాతీయ కార్యవర్గంలో చోటు లభించడంపై రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వినాయకా అపురూపం



వినాయకుడి రూపంలో ఉన్న జంట దుంపలు

కొత్తపేట: పసుపు కొమ్ములు (దుంపలు) వినాయకుడి రూపంలో ఆకట్టుకున్నాయి. కొత్తపేట కమ్మిరెడ్డిపాలేనికి చెందిన పురోహితుడు పెద్దింటి రామచంద్రశ్రీహరి (రామం) తన ఇంటి పెరట్లో గతంలో నల్ల పసుపు దుంపలు నాటారు. ఆ మొక్కలు ఎండిపోవడంతో బుధవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా రామం ఆ దుంపలను తవ్వి బయటకు తీశారు. వాటిలో రెండు దుంపలు వినాయకుడి ఆకృతిలో ఉన్నాయి. ఇందులో ఒకటి నుదుట 3 బొట్లు, నామాలు, ఏకదంతం, పొడవాటి తొండం కలిగి ఉండగా, మరొకటి జంట వినాయకుల రూపంలో ఉన్నాయి. ఇది దైవలీల అని రామం ఆనందం వ్యక్తం చేశారు. ఆ దుంపలకు పూజలు నిర్వహించారు.

ఆదియోగి విగ్రహ ఆవిష్కరణ



మండపేట: ఆంధ్రా శబరిమలైగా పేరుగాంచిన ద్వారపూడి దివ్య క్షేత్రంలో 60 అడుగుల ఆదియోగి విగ్రహాన్ని ఆలయ వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు బుధవారం ఆవిష్కరించారు. గత ఏడాదిగా ఆదిదేవుని విగ్రహాన్ని అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు. ఈ విగ్రహం దేశంలో మూడో ఎత్తయిన విగ్రహంగా పేరు గాంచింది. ఈ విగ్రహాన్ని తిలకించిన భక్తజనంతో అనపర్తి నుంచి జెడ్.మేడపాడు వరకూ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. మూడు గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వేలాది మంది భక్తులు ఆదిదేవుడిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. తొలుత శివ మాల ధరించిన వందలాది మంది భక్తులతో ఆలయ వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రాంతమంతా హరహర మహాదేవ శంభోశంకర నామస్మరణతో మార్మోగింది.



అంతరాలయంలో పూజలు చేస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు కనకరాజు దంపతులు

స్ట్రెచర్‌పై తీసుకెళ్లి.. వైద్యం అందించి



స్ట్రెచర్‌పై రోగిని తరలిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది

పిఠాపురం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చి తీవ్ర అస్వస్థతకు గురైన గోపీకృష్ణ (45)అనే వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి స్ట్రెచర్‌పై తరలించి పిఠాపురం 108 సిబ్బంది ప్రాణాలు కాపాడారు. విజయనగరానికి చెందిన కోనేరు గోపీకృష్ణ దంపతులు మహాశివరాత్రి సందర్భంగా పాదగయ క్షేత్రానికి బుధవారం వచ్చారు. పాదగయ పుష్కరిణి వద్దకు వెళుతుండగా ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో పాటు ఉపవాసం కారణంగా గోపీకృష్ణకు ఫిట్స్ రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఉన్న వైద్య బృందం ఆయన్ని పరీక్షించి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అయితే 108 అందుబాటులో ఉన్నప్పటికీ పాదగయకు పోటెత్తిన జనసందోహం మధ్య అంబులెన్సు రావడం కష్టమైంది. ఆలస్యమైతే ఆయన ప్రాణాలకు ప్రమాదమని భావించిన 108 సిబ్బంది అంబులెన్స్‌లో స్ట్రెకర్‌ను తీసుకువచ్చి దానిపై సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్య సేవలందడంతో ఆయన కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు. సకాలంలో స్పందించి సుమారు కిలోమీటర్ మేర స్ట్రెచర్‌పై తీసుకొచ్చిన 108 సిబ్బంది రాజు, మౌనికను స్థానికులు ప్రశంసించారు.

దోపిడీకి పాల్పడిన కానిస్టేబుళ్ల అరెస్ట్

రాజానగరం: జాతీయ రహదారిపై ఒంటరిగా ప్రయాణించే వారిని టార్గెట్ చేయడం.. ఆపై బెదిరించి వారి నుంచి దొరికినంత దోచుకోవడం వారికి అలవాటు. ఇదేదో బ్లేడ్ బ్యాచ్ వాళ్లేమో అనుకోకండి, ఇదంతా చేస్తున్న శాంతి భద్రతలను కాపాడాల్సిన ఇద్దరు రక్షక భటులు అంటే ఆశ్చర్యం కలుగుతుంది కదూ. కానీ ఇది నిజం. స్థానిక పోలీసులు కూడా ఈ కేసును మొదట్లో పోలీసుల ముసుగులో నకిలీలు ఎవరో చేస్తున్నారనుకున్నారు. దర్యాప్తులో షాకయ్యే నిజం తెలుసుకున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరానికి చెందిన కొండా చంద్రబాబు నాలుగు రోజుల క్రితం చేపల లోడుతో ఉన్న వ్యాన్‌పై కిరాయికి వెళ్లి, తిరిగి రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా రాజానగరం జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి సమీపంలో ఇద్దరు కానిస్టేబుళ్లు అతనిని ఆపి, దోపిడీకి పాల్పడ్డారు. ఎక్కడ నుంచి వస్తున్నావ్! గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నావా అంటూ బెదిరించి, సొమ్ము గుంజుకునే ప్రయత్నం చేశారు. అయితే అతను తనవద్ద ఏమీ లేవనడంతో ఇష్టానుసారంగా కొట్టి, అతని జేబులో ఉన్న రూ. ఐదు వేలు లాక్కున్నారు. అక్కడితో ఆగకుండా అదే ప్రాంతంలో ఉన్న ఒక హోటల్ వద్దకు బాధితుడిని తీసుకువెళ్లి, అక్కడ ఉన్న స్కానర్ ద్వారా అతని సెల్ ఫోన్ నుంచి రూ. 20 వేలు స్కాన్ చేయించారు. అయితే వారు తాము కానిస్టేబుళ్లమని చెప్పినప్పటికీ పోలీసులు ఇలా ఎందుకు చేస్తారనుకుని, వారు నకిలీ పోలీసులనే అనుమానంతో బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే నకిలీలని భావించిన స్థానిక పోలీసులు కూడా ఈ సమాచారం ఎస్పీ కార్యాలయానికి చేరవేయడంతో జరిగిన సంఘటనపై ఆరా తీశారు. హోటల్‌లోని స్కానర్ ద్వారా సొమ్ము తీసుకోవడం నిజమేనని, ఆ విధంగా తీసుకున్న వ్యక్తులు రాజానగరం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న జి.సత్యనారాయణ, వైవీ దొరలేనని హోటల్ యజమాని చెప్పడంతో ఈ దోపిడీ వ్యవహారం బయటపడింది. అయితే వీరిద్దరూ నాలుగు నెలల క్రితమే ఇక్కడకు వేరే పోలీస్ స్టేషన్ నుంచి రాజానగరానికి బదిలీపై వచ్చారు. వచ్చినప్పటి నుంచి జాతీయ రహదారిపై ఇదే విధంగా నేరాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కాగా ఆ ఇద్దరు కానిస్టేబుళ్లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, కోర్టు రిమాండ్ విధించిందని కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై నాగార్జున తెలిపారు.

వీరేశ్వరునికి నాగాభరణం సమర్పణ



వీరేశ్వరునికి సువర్ణ నాగాభరణం సమర్పిస్తున్న దాత నాగేంద్రరావు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరుని ఆలయంలో స్వామివారికి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చెయ్యేరు గ్రామానికి చెందిన త్సవటపల్లి నాగేంద్రరావు దంపతులు 313 గ్రాముల బంగారంతో తయారు చేయించిన నాగాభరణాన్ని బుధవారం సమర్పించారు. దీనిని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సమక్షంలో ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, అర్చకులు యనమండ్ర సుబ్బారావుకు అందజేశారు. రూ.25 లక్షలతో తయారు చేసిన నాగాభరణానికి తొలుత అర్చక స్వాములు యనమండ్ర సత్యసీతారామశర్మ, పేటేటి శ్యామల కుమార్ ప్రత్యేక పూజలు చేసి స్వామికి అలంకరించారు.

కేశవస్వామికి వెండి కవచం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలోని ఉపాలయంలో కొలువై ఉన్న కేశవస్వామి వారికి, అంతర్వేదికరకు చెందిన భక్తుడు బెల్లంకొండ నాగమల్లేశ్వరరావు, భానుకళ దంపతులు వెండి కవచాన్ని సమర్పించారు. మూడు కిలోలు బరువుగల రూ.3.15 లక్షల ఖరీదు చేసే కవచాన్ని, ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్‌కు ఆయన అందజేశారు. ఆలయ అర్చకులు వెండి కవచానికి సంప్రోక్షణ, పూజలు నిర్వహించి, కేశవస్వామివారికి అలంకరించారు. దాత బెల్లంకొండ వెంకట నరసింహారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంతర్వేది ఉపాలయంలో కేశవస్వామికి వెండి కవచం సమర్పిస్తున్న భక్తుడు నాగమల్లేశ్వరరావు

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం, క్రైం సిబ్బంది

రావులపాలెం: ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదును దొంగిలించిన ఘటన బుధవారం రావులపాలెం మండలం లక్ష్మీ పోలవరంలో జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీపోలవరం గ్రామంలో నివాసం ఉంటున్న దేవగుప్తాపు వీరవెంకట సత్య శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 22న పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం ముప్పర్తిపాడు గ్రామంలో జరుగుతున్న అమ్మవారి జాతరకు వెళ్లారు. అయితే మంగళవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బెడ్‌రూమ్ తలుపులు తెరిచి ఉండడంతో, లోపలకు వెళ్లి చూశారు. బీరువా తెరిచి ఉండడంతో పాటు దుస్తులు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయి. దీంతో బీరువాలో పరిశీలించగా 31 కాసుల వివిధ బంగారు ఆభరణాలు, రూ.1.70 లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అమలాపురం నుంచి క్లూస్ టీమ్, క్రైం పోలీసు సిబ్బందిని రప్పించి బీరువాపై ఉన్న వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ సీఐ శేఖర్ బాబు తెలిపారు. బంగారం విలువ సుమారు రూ. ఏడు లక్షలు, నగదు మొత్తం కలిపి చోరీ సొత్తు విలువ సుమారు రూ.8.70 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్టు సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

REAL ESTATE

■ కొండయ్యపాలెం ఫ్లైఓవర్ జంక్షన్‌లో శ్రీ నగర్, వెంకటనగర్, కృష్ణా నగర్, సురేష్ నగర్, శాస్త్రి నగర్, ఎల్.బి.నగర్, వాకలపూడి, పేర్రాజుపేటలలో స్థలములు మరియు గాంధీనగర్‌లో అపార్ట్‌మెంటులు కలవు. పి.ఎ.స్వామి ✆ : 98481 07949 [R-122]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2602]

Wanted

■ కాకినాడ డోర్స్ కంపెనీ నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M) ఆఫీస్ బాయ్స్ (M) కావలెను. ✆ : 88826 56789 [SCA-25001875]

■ ప్రముఖ సంస్థలో రాజమండ్రి, విశాఖపట్నం, కాకినాడ, హైదరాబాదులలో పనిచేయుటకు నిరుద్యోగులైన యువతీ యువకులు, రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. సెల్ : 94940 42487, 98498 22088 [R-15866]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA25001814]

■ కన్సల్టెన్సీ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు, ఫ్రీరూమ్+భోజనం. Hyd.ఫోన్: 9666253675 [HA-99924]

■ సాయిరామ్ హోమ్‌కేర్:Hydలో బేబీకేర్, పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు, నర్సులు & ఇంటి/వంటపనికి కావలెను.జీ:18వేలు✆9949094607,99084 54607 [SCA25001783]

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు కాకినాడ, పెద్దాపురం, కత్తిపూడి, రాజమండ్రి ప్రాంతాలలో పని చేయుటకై ఫీల్డ్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్లు, గార్డులు, రిసెప్షనిస్టులు, హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్లు, బాయ్స్, మేడ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం PF, ESI కలదు. సంప్రదించండి. సెల్:7382251616, 9493785599, 0884-4074382, 9381213234 [SCA-25001896]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.